
ఎన్నికల ప్రచారంలో డాక్టర్ కోట నీలిమ

అందుబాటులో ఉంటా ఆశీర్వదించండి

కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ ప్రజలకు అందుబాటులో ఉంటా.. ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా ఆశీర్వదించాలని కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కోట నీలిమ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో మంగళవారం ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి.. ప్రజలకు సేవ చేయడానికి తాను రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలు ఆదరించాలన్నారు. సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనతో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు 6 గ్యారంటీ పథకాలపై ప్రజల్లో మంచి స్పందన ఉందన్నారు. సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పేదల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. ప్రభుత్వ పథకాలు బీఆర్‌ఎస్ నాయకులకు కల్పతరువుగా మారాయన్నారు.

ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించండి..

సనత్‌నగర్: తనను గెలిపించి సనత్‌నగర్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని కలిగించాలని కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ అన్నారు. బేగంపేట డివిజన్ వికార్‌నగర్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తనపై నమ్మకాన్ని ఉంచి టికెట్ ఇచ్చిందని, ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడతానన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ, పింఛన్లు, ఉద్యోగ అవకాశాలు, ప్రాజెక్టులు, ఎన్నో సంక్షేమ పథకాలు ఉండేవన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కేంద్రంలో బీజేపీలు పదేళ్ల పాలనలో చేసిందేమీ లేదన్నారు. జాతీయ మహిళా కాంగ్రెస్ నాయకులు నీటా డిసౌజ మాట్లాడుతూ.. ముస్లింలను ఓటు బ్యాంక్ రాజకీయంగా వాడుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సలీంఖాన్, అనీఫ్ తదితరులు పాల్గొన్నారు.



వికార్‌నగర్‌లో జరిగిన సభలో కోట నీలిమ

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

కంటోన్మెంట్ ఆర్ఓ మధుకర్ నాయక్

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో పోలింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని రిటర్నింగ్ అధికారి మధుకర్ నాయక్ వెల్లడించారు. నామినేషన్ల ప్రక్రియ ముగిశాక మొత్తం 10 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. వారికి సంబంధించి గుర్తులు, పేర్లతో కూడిన బ్యాలెట్ పేపర్ల ముద్రణతో పాటు ఈవీఎంలపై అతికించినట్లు వెల్లడించారు. 113 ప్రాంతాల్లో 232 పోలింగ్ కేంద్రాలతో పాటు 1500 కన్న అదనంగా ఓట్లు ఉన్న మూడు బూత్‌లలో అదనంగా మరో మూడు ఈవీఎంలు సిద్ధం చేశామన్నారు. గురువారం వెస్లీ కాలేజీలోని కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని 461 మంది పోస్టల్ ఓటర్లకు సంబంధించి ఈ పాటికే బ్యాలెట్ పేపర్లు పంపిణీ చేశామన్నారు. మంగళవారం 202 మంది పోలీసు సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్లు అందజేశామని తెలిపారు. 25, 26 తేదీల్లో పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు పోస్టల్ బ్యాలెట్లను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.


నమూనా పోలింగ్ కోసం ఏర్పాట్లు

- కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 10 మంది అభ్యర్థులు బరిలో నిలవగా జాతీయ పార్టీలకు చెందిన నలుగురు, రిజిస్టర్డ్ పార్టీల తరఫున ముగ్గురు, మరో ముగ్గురు ఇండిపెండెంట్లు బరిలో నిలిచారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా అభ్యర్థుల సీరియల్ నెంబర్, ఇండిపెండెంట్లకు గుర్తులు కేటాయించారు.

బీఆర్‌ఎస్ అనాలోచిత నిర్ణయాలతో ఇబ్బందులు


మర్రి శశిధర్‌రెడ్డికి హారతి ఇస్తున్న మహిళలు

బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: బీఆర్‌ఎస్ పాలకుల అనాలోచిత నిర్ణయాలతో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని సనత్‌నగర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన సనత్‌నగర్, రాంగోపాల్‌పేట డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ప్రచారంలో ఆయనకు మహిళలు హారతులు పట్టారు. అలాగే పలు సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఆయా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటానన్నారు. ముఖ్యంగా కృష్ణానగర్ కాలనీలో ఐదేళ్ల క్రితం కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేస్తామని చెప్పి శిలాఫలకానికే పరిమితం చేశారన్నారు. పీజీ రోడ్డులో ప్రధాన రహదారి మాత్రమే వైట్ ట్యాపింగ్ రోడ్డు వేయడంతో కాలనీల రోడ్లు లోతట్టుగా మారడంతో నీళ్లు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బాపుబాగ్‌కాలనీ రోడ్డు అధ్వానంగా మారిందన్నారు. రూ.కోట్లలో ఖర్చు పెట్టామని చెప్పుకునే మంత్రికి ఇవి కనిపించవా అని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ఆలోచనతో అభివృద్ధి పనులు చేపడతానన్నారు. గతంలో కూడా తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజలకు శాశ్వతంగా మేలు చేసేవిధంగా చేపట్టానన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం నిత్యం ప్రజా సంక్షేమం గురించి ఆలోచన చేస్తోందన్నారు. అమలుకాని హామీలను ఇవ్వకుండా తాను ప్రజల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు చేపడతానన్నారు. కమలం గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలన్నారు.

తండ్రికి మద్దతుగా..

బన్సీలాల్‌పేట్: బీజేపీతోనే సనత్‌నగర్‌లో అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని గాంధీనగర్, గొల్లకొమురయ్య కాలనీ, ఉప్పలమ్మ దేవాలయం, బోయిగూడ ఇస్లామియా స్కూల్ ఏరియా తదితర ప్రాంతాల్లో మంగళవారం బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి తనయుడు మర్రి పురురవరెడ్డి, నాయకులు వై. సురేష్ కుమార్, గుంటి సత్యనారాయణ ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అవినీతి బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనకు ప్రజలు చరగీతం పాడాలన్నారు. ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యే, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రజా సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు.


తనకు ఓటేయాలని కోరుతున్న దృశ్యం

తొలి తమిళ ఎమ్మెల్యేను గెలిపించండి



కంటోన్మెంట్: తెలంగాణలో తొలిసారిగా ఒక తమిళ వ్యక్తిని ఎమ్మెల్యేగా గెలిపించుకునే అవకాశం వచ్చిందని, కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా శ్రీగణేశ్‌ను గెలిపించాలంటూ బీజేపీ తమిళనాడు అధ్యక్షులు అన్నామలై అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన కంటోన్మెంట్ పరిధిలోని కార్ఖానా, లాల్‌బజార్‌లో నిర్వహించిన సభల్లో స్థానిక బీజేపీ అభ్యర్థి శ్రీగణేశ్‌తో కలిసి పాల్గొన్నారు. సుమారు 500 ఏళ్ల క్రితం తమిళులను ఇక్కడికి బానిసలుగా తీసుకొచ్చారని అన్నారు. ఇప్పటికీ ఇక్కడి తమిళులకు వాళ్ల చరిత్ర తెలియదన్నారు. కంటోన్మెంట్‌లో తమిళుల పట్ల వివక్ష కొనసాగుతోందన్నారు. తమిళులు ఇళ్లు కట్టుకోవడం కూడా ఇబ్బంది కరంగా మారిందన్నారు. కంటోన్మెంట్‌లో తమిళులతో పాటు పేదల సమస్యల పట్ల స్పష్టమైన అవగాహన కలిగిన బీజేపీ అభ్యర్థి శ్రీగణేశ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలి. రిజర్వ్‌డ్ నియోజవర్గమైన కంటోన్మెంట్‌ను కేసీఆర్ అణచివేశా డని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ అన్నారు. వివక్షపైకో ర్టుకెక్తేనే జీహెచ్ఎంసీతో పాటు కంటోన్మెంట్‌కు ఉచిత నీళ్లు ఇచ్చారన్నారు. పదేళ్లు గా కంటోన్మెంట్‌కు ఒక్క రూపాయి కూడా అభివృద్ధి నిధులు ఇవ్వలేదని ఆరోపించారు.

రైలు దిగుతుండగా కిందపడి మహిళ మృతి

అడ్డగుట్ట: రైలు దిగుతుండగా కాలుజారి రైలుకింద పడి ఓ మహిళ మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. లాలాపేట ప్రాంతానికి చెందిన కలపాక రాణి (38) కూలీ పని చేస్తుంటోంది. ఈ నెల 20న రాత్రి 8 గంటల సమయంలో సికింద్రాబాద్ నుంచి కాజీపేట్ వెళ్తున్న పుష్పుల్ రైలు మౌలాలి రైల్వే స్టేషన్‌లో ఆగింది. ఈ క్రమంలో రైలులో నుంచి దిగుతున్న రాణి ప్రమాదవశాత్తు కాలు జారీ రైలు కింద పడింది. అప్పటికే కదులుతున్న రైలు సదరు మహిళపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్లవంకాయ 16, పొడుగు వంకాయ 16, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 28, పచ్చకాకర 23, పందిరి బీర 28, క్యాబేజీ 11, క్యారెట్ 35, దొండ 23, గుండుబీన్స్ 60, గింజ చిక్కుడు 45, గోకరకాయ 28.


పద్మారావుతో సెల్ఫీ దిగుతున్న చిన్నారి

సికింద్రాబాద్ అభివృద్ధి బీఆర్‌ఎస్ ఘనతే

బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్

చిలకలగూడ: ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి సికింద్రాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆ పార్టీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు అన్నారు. మంగళవారం ఆయన సీతాఫల్‌మండి డివిజన్ టీఆర్‌టీ క్వార్టర్స్, బీదలబస్తీ, ఎరుకలబస్తీ, సీతాఫల్‌మండి తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ హేమతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఆస్పత్రి, పాఠశాల, కాలేజీ, వార్డు కార్యాలయం, ఫంక్షన్ హాల్ నూతన భవనాల నిర్మాణం, ఆర్‌యూబీ, మంచినీటి రిజర్వాయర్ల ఏర్పాటు ఇలా అన్ని రంగాల్లోనూ సికింద్రాబాద్‌ను అభివృద్ధి చేశామన్నారు. హ్యాట్రిక్ గెలుపు ఖాయమని, అత్యధిక మెజార్టీ సాధించే దిశగా ప్రచారం కొనసాగిస్తున్నామన్నారు. టీఆర్‌టీ క్వార్టర్స్ ఉప్పలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సీతాఫల్‌మండి చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆయా ప్రాంతాల ప్రజలు హారతులు ఇచ్చి, పూలమాలలు వేసి పద్మారావుకు ఘనస్వాగతం పలికారు. ప్రచారంలో డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్ రెడ్డి, నాయకులు రామేశ్వర్, కిరణ్, కిషోర్, కరాటే రాజు, నోముల ప్రకాశరావు, రాంచందర్, చంద్రశేఖర్, సంగీత్ పాల్గొన్నారు.

పలు సంఘాల మద్దతు..

తెలంగాణ నాయీ బ్రాహ్మణ సంఘం, తెలంగాణ విశ్వబ్రాహ్మణ సంఘం, సికింద్రాబాద్ గౌడ్ సంఘాలు సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుకు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. పద్మారావు విజయానికి తమవంతు కృషి చేస్తామని ఆయా సంఘాల ప్రతినిధులు మంగళవారం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు రాంబాబు నాయి, ఓంప్రకాశ్, శంకర్, మనోహర్, హరినాథ్, వెంకటేష్‌నాయి, శ్రీహరి చారి, రాఘవ, భాస్కర్, రమణ, శ్రీనివాసగౌడ్, ఆంజనేయులు,బాలరాజ్‌గౌడ్, రాజేశ్వర్, లింగం, నర్సయ్య, సురేష్, కుమారస్వామి, మానస, రేణుక పాల్గొన్నారు.

టీటీయూసీ మద్దతు..

లాలాపేట: పద్మారావు గౌడ్ గెలుపు కోసం తెలంగాణ ట్రేడ్ యూనియన్ సెల్(టీటీయూసీ) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి, బీఆర్‌ఎస్ నేత ఇరుగు జగదీశ్వర్ తెలిపారు. మంగళవారం శాంతినగర్‌లో నేతలతో కలిసి సమావేశమై మాట్లాడారు. సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమమే బీఆర్‌ఎస్ అభ్యర్థులను విజయతీరాలకు చేరుస్తాయన్నారు.

పలువురి చేరిక..

తార్నాక డివిజన్ లాలాపేటకు చెందిన పలువురు యువకులు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు డెంజిల్ ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరగా డిప్యూటీ స్పీకర్ పద్మారావు తనయులు రామేశ్వర్‌గౌడ్, త్రినేత్ర గౌడ్ గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. పద్మారావు గౌడ్ మూడోసారి ఘన విజయం సాధించడానికి యువత కృషి చేయాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో సంపత్, శ్రావణ్, శివ, కె.రాజు, సాయికిరణ్ ఉన్నారు.


పద్మారావుకు మద్దతు ప్రకటిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

కాంగ్రెస్ గెలుపుతో మళ్లీ ఇందిరమ్మ రాజ్యం

సనత్‌నగర్: ఇందిరమ్మ రాజ్యం మళ్లీ రావాలని, అప్పుడే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్ అన్నారు. మంగళవారం ఆయన బేగంపేట డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ మాట్లాడారు. హస్తం గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. బీఆర్‌ఎస్ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ పాలనతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రచారంలో నాయకులు సత్యంశ్రీరంగం, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, రమేష్,రమాదేవి, భారతమ్మ, వేణు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ పెద్ద డ్రామా కంపెనీ

ఈటల రాజేందర్


మాట్లాడుతున్న ఈటల రాజేందర్

రసూల్‌పురా: రసూల్‌పురా ప్రాంతాన్ని సీఎం కేసీఆర్ దత్తత తీసుకుంటానని పదేళ్ల క్రితం చెప్పి ఇప్పటి వరకు ఆ ఊసేలేదని సీఎం కేసీఆర్ పెద్ద డ్రామా కంపెనీ అని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు. కంటోన్మెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి శ్రీ గణేష్‌కు మద్దతుగా అన్నానగర్‌లో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో ఈటల పాల్గొని మాట్లాడారు. రెండు సార్లు సీఎం పదవిలో ఉండి ప్రజలకు ఏమీ చేయని కేసీఆర్ మరో సారి అధికారం ఇస్తే దోచుకుంటాడన్నారు. సదా కేశవరెడ్డి మాట్లాడుతూ.. కంటోన్మెంట్ బోర్డుకు చెందిన రూ. వంద కోట్లు దొడ్డిదారిన దోచుకున్న సీఎం కేసీఆర్ తమ వంద కోట్లు ఇస్తే కంటోన్మెంట్‌ను బంగారు కంటోన్మెంట్‌గా తీర్చిదిద్దుకుంటామన్నారు. శ్రీ గణేష్ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో భానుక మల్లికార్జున్, కనకరాజు, అశోక్, జబ్బార్, మణికంఠ పాల్గొన్నారు.

రాష్ట్రంలో కుటుంబ పాలన : డాక్టర్ లక్ష్మణ్


రోడ్‌షోలో మాట్లాడుతున్న లక్ష్మణ్

బౌద్ధనగర్: అటు రాష్ట్రం, ఇటు సికింద్రాబాద్‌లో కుటుంబ పాలన నడుస్తోందని బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ ఆరోపించారు. ఈ పార్టీ అభ్యర్థి మేకల సారంగపాణికి మద్దతుగా వారాసిగూడ చౌరస్తాలో నిర్వహించిన రోడ్ షోలో లక్ష్మణ్ పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ పాలనలో విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. పథకాల పేరుతో పేద, మధ్య తరగతి ప్రజలను మోసం చేసిన కేసీఆర్‌కు ఈ సారి ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలందరూ బీజేపీ వైపే చూస్తున్నారని, తెలంగాణలో రానున్నది డబుల్ ఇంజన్ సర్కార్ అని ధీమా వ్యక్తం చేశారు. ఈ రోడ్‌షోలో మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి, మేకల కీర్తి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

బీజేపీకి శంకర్రావు రాజీనామా

రసూల్‌పురా: ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో కంటోన్మెంట్‌లో బీజేపీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు కన్వీనర్ కేబీ. శంకర్రావు మంగళవారం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. తిరుమలగిరిలో తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రజలకు మంచి పాలన అందిస్తోందని తాను ఆ పార్టీలో చేరానని కానీ.. కొందరు నేతలు తమ స్వార్థ రాజకీయాలకు దళితులను అణగదొక్కుతూ గుర్తింపు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఏ పార్టీలో ఉన్న తాను ప్రజల సంక్షేమం కోసమే పనిచేసామన్నారు. తన కార్యకర్తల అభీష్టం మేరకు ప్రధాని మోదీ, నామినేటెడ్ సభ్యులు రామకృష్ణకు బైబై చెప్పి లాస్యనందితకు మద్దతుగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నామని శంకర్రావు ప్రకటించారు.

‘ఫర్ పీపుల్ హు మూవ్’ లో అఖిల్ అక్కినేని

సాక్షి సిటీబ్యూరో: వినూత్న మార్గాలను ఎంచుకుని చరిత్ర సృష్టించే వ్యక్తుల విజయగాధల్ని తెలియజెప్పేందుకు యూకేకి చెందిన ప్రముఖ పాదరక్షల బ్రాండ్ ఫిట్‌ఫ్లాప్ ‘ఫర్ పీపుల్ హు మూవ్’ పేరిట సరికొత్త ప్రచార కార్యక్రమాన్ని రూపొందించింది ఈ ప్రచార కార్యక్రమంలో టాలీవుడ్ హీరో అఖిల్ అక్కినేని, ఫ్యాషన్ రంగానికి చెందిన నందినీ భల్లా, వెడ్డింగ్ ఫొటో గ్రాఫర్ జోసెఫ్ రాధిక్ తదితరులు కీలకపాత్ర పోషిస్తున్నారని, దేశ వ్యాప్తంగా ఇది నిర్వహిస్తున్నామని మెట్రో బ్రాండ్స్ లిమిటెడ్ ప్రతినిధులు తెలిపారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే బేగంపేట అభివృద్ధి


రోడ్‌షోలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సనత్‌నగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బేగంపేట డివిజన్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేయడం జరిగిందని బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు అన్నారు. డివిజన్ పరిధిలోని ప్రకాష్ నగర్, మయూరిమార్గ్, అల్లంతోటబావి, శ్యాంలాల్ బిల్డింగ్ ప్రాంతాల్లో మంగళవారం ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. బేగంపేట ప్రాంతంలో వర్షం వస్తే ముంపునకు గురై ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారని, తాను ఎమ్మెల్యే అయ్యాక సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో నాలా ఆధునికీకరణ చేశామన్నారు. అలాగే బస్తీల నుంచి నాలాకు వెళ్లే డ్రైనేజీ పైప్‌లైన్లను నూతనంగా వేయించామన్నారు. ఎక్కడికక్కడ సీసీ రోడ్ల నిర్మాణం, పార్కుల సుందరీకరణ, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేశామని గుర్తు చేశారు. దశాబ్దాల పాటు పరిష్కారం కాని ధనియాలగుట్ట శ్మశానవాటికకు స్థలం కేటాయించడంతో పాటు కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేశామని అల్లంతోటబావిలో వరదనీరు నిలవకుండా పట్టా భూమి నుంచి పైప్‌లైన్లు వేయించి సమస్యను పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి, నాయకులు శ్రీహరి, సురేష్‌యాదవ్, రాజయ్య, నరేష్, పాండు, సత్యనారాయణ, రఘు, పద్మారెడ్డి పాల్గొన్నారు.

బన్సీలాల్‌పేట్‌లో బీఎస్పీ ప్రచారం

పద్మారావునగర్: బహుజనులు తమ బతుకుల బాగు కోసం ఎన్నికల్లో బీఎస్పీని ఓటుతో ఆశీర్వదించాలని సనత్‌నగర్ అభ్యర్థి గుండబోయిన అఖిలేష్ ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలు బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఎన్నికల్లో తిరస్కరించాలని కోరారు. అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలోని బీఎస్పీ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తోందని అణగారిన వర్గాలు తమ హక్కుల సాధనతో పాటు విద్యా, ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధి కోసం ఎన్నికల్లో ఏనుగు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.


ప్రచారం చేస్తున్న అఖిలేష్

సాయన్న మృతిపై వాస్తవాలు వెల్లడించాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భానుక మల్లికార్జున్

కంటోన్మెంట్: దివంగత ఎమ్మెల్యే సాయన్న మరణానికి గల కారణాలు వెల్లడించాల్సిన బాధ్యత బీఆర్‌ఎస్ నేతలపై ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భానుక మల్లికార్జున్ డిమాండ్ చేశారు. కంటోన్మెంట్‌లోని మడ్‌ఫోర్ట్‌లో ఓ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని తమతో మాట్లాడి ప్రగతి భవన్‌కు వెళ్లిన సాయన్న తిరిగి శవంగానే కంటోన్మెంట్‌కు వచ్చాడన్నారు. అసలు ప్రగతి భవన్‌లో ఏమైందని ప్రశ్నించారు. మంగళవారం కార్ఖానాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాయన్న పట్ల పార్టీ నేతలకు నిజమైన సానుభూతి ఉంటే ఆయన కుమార్తెకు ఎమ్మెల్సీ లేదా.. నామినేటెడ్ పదవి ఇవ్వాల్సిన ఉందన్నారు. ఓడిపోయే చోట ఆమెను నిలబెట్టి తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. ఎంఐఎం కండువాలతో ప్రచారం చేయడం, నెల రోజుల్లోనే నలుగురు ఇంచార్జులను మార్చారంటే బీఆర్‌ఎస్ పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవాలన్నారు. తమ అభ్యర్థి శ్రీగణేశ్ కౌన్సిలర్‌గా ప్రజల మధ్య ఉంటూ సేవ చేస్తున్నాడని, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఏనాడైనా ప్రజల బాగోగులు పట్టించుకున్నారా అంటూ ప్రశ్నించారు.


మాట్లాడుతున్న భానుక మల్లికార్జున్

నేడు చర్చకు రండి..

డబుల్ బెడ్రూమ్ బాధితుడితో లాస్య నందిత మాట్లాడిన వీడియో ఫేక్ అంటూ చెబుతున్న బీఆర్‌ఎస్ నేతలు నిజమైన బాధితులతో మాట్లాడిస్తే ఏం చెబుతారంటూ బీజేపీ మహంకాళీ జిల్లా అధికార ప్రతినిధి బీఎన్ శ్రీనివాస్ ప్రశ్నించారు. బుధవారం మధ్యాహ్నం 12.00 గంటలకు తాము డబుల్ బెడ్రూమ్ బాధితులతో ప్రత్యక్షంగా మాట్లాడిస్తామని లాస్య నందిత అక్కడికి వచ్చి నిజానిజాలు వెల్లడించాలన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ నేతలు సతీష్, శ్రీకాంత్, కనకరాజ్, విజయ్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు మేలు

• మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతోందని, మరోసారి గెలిపించడం ద్వారా సంక్షేమ పథకాలను కొనసాగించుకునేందుకు అవకాశం ఉంటుందని ఆ పార్టీ సనత్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. రాంగోపాల్‌పేట డివిజన్ నల్లగుట్టలోని గైదన్‌బాగ్‌కు చెందిన రషీద్, షఫీ, అశ్వక్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసంలో మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తూ ప్రజల ఆదరాభిమానాలను పొందామన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచే కాకుండా విద్యావంతులు, విశ్రాంత ఉద్యోగులు సైతం బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్‌పేట డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, రాజేష్, అశ్వక్, సాద్విక్ తదితరులు పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులతో తలసాని